

పంటల సర్వే సక్రమంగా చేపట్టాలి
● జనన, మరణ నమోదులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : బళ్లారి కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

8

లోకాయుక్త వలలో
ఇద్దరు కార్మిక శాఖ అధికారులు
● పెట్రోల్ బంకు యజమాని నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన వైనం

● రాష్ట్రంలో శ్రుతిమించుతున్న రియల్టర్ల ఆగడాలు
● 'రేరా' చట్టానికి యథేచ్ఛగా తూట్లు
● అనుమతులు లేకుండానే వెంచర్లు, అపార్ట్‌మెంట్లు
● 'సాఫీ'గా సహకరిస్తున్న అధికారులు
● బలవుతున్న అమాయకులు.. పెండింగ్‌లో లక్షకుపైగా ఫిర్యాదులు



అడిగేవారే లేరా..?

2017 నుంచే రాష్ట్రంలో రేరా

కేంద్రప్రభుత్వం 2016లో దేశవ్యాప్తంగా రేరా చట్టం తీసుకొచ్చింది. 2017లో రాష్ట్రంలోనూ అమలు చేశారు. గృహ నిర్మాణశాఖ పరిధిలో రేరా పనిచేయనుంది. రేరా కార్యదర్శి ఐఏఎస్ అధికారి ఉంటారు. రేరా చైర్మన్‌గా మాజీ ఐఏఎస్, సభ్యులుగా మాజీ ఐఆర్ఎస్ అధికారులను నియమిస్తారు. చట్టానికి అనుగుణంగా వసతి సముదాయం, లే అవుట్‌లను నిర్మించేవారు ప్రాధికారనుంచి అనుమతులు పొందాలి. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు, ఏజెంట్‌లు వివరాలను నమోదు చేయడం తప్పనిసరిగా ఉంటుంది. ప్రాజెక్టు వివరాలు, లే అవుట్ స్థితిగతులు, భూమి పరిస్థితి, ప్రమోటర్స్‌తో ఒప్పందం, కాంట్రాక్టర్లు, ఆర్కిటెక్చర్స్ ఇంజనీర్ల పేర్లు, చిరునామాలను ప్రాధికారలో నమోదు చేయాల్సి ఉంటుంది. నిర్ణీత గడువులోగా హౌసింగ్ ప్రాజెక్టును పూర్తి చేయాలి. చట్టంలో సూచించిన మార్గదర్శకాలను పాటించకపోతే జరిమానా విధించాలి. వెబ్‌సైట్‌లలో మౌలిక వసతుల కొరత విషయమై కొనుగోలు దారులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకునే అధికారం ప్రాధికారకు ఉంది. ప్రాజెక్టులు రిజిస్ట్రేషన్‌కు సంబంధించి పర్యవేక్షణ, ప్రగతి పరిశీలన, సమస్యల పరిష్కారం, అనధికార లే అవుట్‌ల నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకునే అధికారం ప్రాధికారకు ఉంటుంది. ఆ దిశగా రేరా కమిటీ ఎటువంటి ప్రాజెక్టులనైనా మార్గదర్శకాలు పాటించకుంటే కఠిన చర్యలు విధించవచ్చు. కానీ రేరాకు చెందిన కొందరు అధికారులు, కొంతమంది రియల్టర్లతో చేతులు కలిపి దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

బెంగళూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్ర రాజధానితోపాటు రాష్ట్రవ్యాప్తంగా సొంతింటి కల సాకారం, ఇంటి స్థలం దక్కించుకోవాలని పొదుపుచేసిన సొమ్మును పెట్టుబడి పెట్టి మోసపోకుండా ఉండాలనే కర్ణాటక రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (కే-రేరా) చట్టం తీసుకొచ్చారు. అయితే పాటించేవారే లేకుండా పోతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారాల నియంత్రణ, అభివృద్ధి విషయంలో చట్టానికి అనుగుణంగానే ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావించింది. కానీ రియల్ ఎస్టేట్ దందా తీవ్రరూపం దాల్చి ఎక్కడికక్కడ లే అవుట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. చట్టానికి అనుగుణంగా లే అవుట్ వేశామని కొం దరు, ఇంకా అనుమతులు రాలేదని మరికొందరు, ఏకంగా నకిలీ సర్టిఫికెట్‌లు చూపి మోసం చేస్తున్న విధానాలు ప్రతిచోటా వెలుగులోకి వస్తున్నాయి.

ఒక్కసారి పెట్టుబడి పెట్టి ఇంటి స్థలం లేదా అపార్ట్‌మెంట్ సొంతం చేసుకోవాలనేవారికి అడ్వాన్స్‌లు చెల్లించాక లేదా పూర్తి మొత్తం ముట్టచెప్పాక అసలు విషయాలు తెలుస్తున్నాయి. దీంతో వేలాదిమంది ఫిర్యాదులు చేస్తున్నారు. రేరాలో ఇప్పటివరకు ప్రాజెక్టుల అనుమతుల కోసం 9,412 దరఖాస్తులు చేశారు. మౌలిక సదుపాయాలు లేకుండానే విక్రయాలు జరిపారని 12040 మంది ఫిర్యాదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండానే 1050 లే అవుట్‌లు వెలిశాయి.

ఎన్నెన్నో ఉల్లంఘనలు

సాంకేతిక, ఆర్థిక విభాగాలనుంచి మోసాలకు అవకాశం ఉంది. కాసింత లంచం ముట్టచెబితే హౌసింగ్ ప్రాజెక్టుకు అనుమతులు ఇస్తారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని నిబంధనలు సడలించి అనుమతులు ఇస్తారు. డిఫాల్ట్ డెవలెపర్లకు కొత్త ప్రాజెక్టును ప్రారంభించేందుకు అనుమతులు ఇస్తారు. రిజిస్ట్రేషన్ లేకుండానే ఇంటి స్థలాలను ముందుగానే బుకింగ్ చేసుకోవడం లేదా విక్రయాలకు అవకాశం ఉంది. జాయింట్ డెవలెప్‌మెంట్ అగ్రిమెంట్ లేకున్నా కూడా హౌసింగ్ ప్రాజెక్టు ప్రారంభించడం, ప్రాజెక్టు జాప్యమైతే కొనుగోలుదారుడికి లభించాల్సిన రిటర్న్ పరిహారం లభించదు. ఎక్కువ ప్రాజెక్టులకు జరిమానా విధించడం లేదు. లే అవుట్ నిర్మాణాలకు ముందు పాటించాల్సిన నిబంధనలను అనుసరించడం లేదు. జిల్లా అధికారులనుంచి భూ పరివర్తన (ల్యాండ్ కన్వర్షన్) అనుమతులు లేకుండా విక్రయించడం, స్థానిక ప్లానింగ్ కమిషన్ నుంచి బ్లూ ప్రింట్ పొందకపోవడం, లే అవుట్‌లలో ప్రజలకు తగిన సౌలభ్యాలు, రోడ్ల నిర్మాణానికి తగినంత స్థలం కేటాయించకపోవడం వంటివి, నిర్ణీతమైన గడువులో ప్రాజెక్టు పూర్తి చేయకుండా ఉండడం, సమగ్ర మౌలిక వసతులు సమకూర్చకపోవడం వంటివి.

రూ.666 కోట్ల జరిమానా పెండింగ్

రాష్ట్రంలో హౌసింగ్ లే అవుట్‌లలో 90శాతం వ్యక్తుల పేరుతోనే ఏర్పాట్లు చేస్తున్నారు. మిగిలిన 10 శాతం సంఘసంస్థల పేరుతో ఉన్నాయి. కొన్ని లే అవుట్‌లకు ప్రారంభంలో కొంతభూమికి మాత్రమే ప్రాధికారనుంచి అనుమతులు పొందుతారు. ఆ తర్వాత ఎక్స్‌టెన్షన్ పేరిట లే అవుట్‌లను ఏర్పాటు చేస్తారు. స్థానిక సంస్థలకు ప్రభుత్వం మార్గదర్శకాలు సూచించినా అవి కార్యరూపం దాల్చడం లేదు. రాష్ట్రంలో అత్యధికంగా అనధికార లే అవుట్‌లు బెంగళూరు, మైసూరులలో ఉన్నాయి. నిబంధనల ఉల్లంఘించిన మేరకు 1427 కేసులు నమోదు చేశారు. వారి నుంచి రూ.666 కోట్ల రూపాయలు జరిమానాను విధించారు. కానీ బిల్డర్లు చెల్లించకుండా వాయిదాలు వేస్తున్నారు. రేరాచట్టం సమగ్రంగా అమలైతే హౌసింగ్ ప్రాజెక్టులలో సొంతింటి కల సాకారం చేసుకునే వారికి ఎటువంటి సమస్య ఉండదు. అధికారులు, రేరా కమిటీ పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బెంగళూరులోని రేరా కార్యాలయం

రిజిస్ట్రేషన్ ఎలా..?

అపార్ట్‌మెంట్‌లు, లే అవుట్‌లను ప్రారంభించే ప్రమోటర్లు ప్రాజెక్టు రిజిస్ట్రేషన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అఫిడవిట్ సమర్పించాలి. రెవెన్యూ అధికారులు భూమి స్థితిగతులను, ఆర్థికపరమైన ఏర్పాట్లను పరిశీలిస్తారు. ఆర్కిటెక్చర్‌లు, సివిల్ ఇంజనీర్లు నిర్మాణ ప్రాజెక్టుల సాంకేతికతను పరిశీలిస్తారు. ప్రమాణాలు, నిబంధనలు సక్రమంగా ఉంటే అమోదించేందుకు రేరా కార్యదర్శితోపాటు సభ్యుల ద్వారా చైర్మన్‌కు పంపుతారు. 30 రోజుల్లో దరఖాస్తును పరిష్కరించడం లేదా ఏమైనా సందేహాలు ఉంటే వాటికి వివరాలు కోరవచ్చు. మార్గదర్శకాలు పాటించకుంటే చైర్మన్ సదరు ప్రాజెక్టు దరఖాస్తును తిరస్కరించవచ్చు. అన్నీ సజావుగా ఉన్నట్టు రేరా సభ్యులతోపాటు కార్యదర్శి నిర్ధారిస్తే ప్రత్యేక నెంబరుతో రిజిస్ట్రేషన్ ప్రమాణ పత్రాన్ని కేటాయిస్తారు. ఆ తర్వాత నివాసం, ప్లాట్ విక్రయాలకు ప్రమోటర్స్‌గా చట్టంగా అధికారం లభించనుంది.

గ్రేటర్ బెంగళూరు అథారిటీ బిల్లుకు

ఆమోదం

సభలో ప్రవేశపెట్టిన నగరాభివృద్ధిశాఖ మంత్రి డీకే శివకుమార్



బెంగళూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ బెంగళూరు అథారిటీ 2025 సవరణల బిల్లును శాసనసభలో మంగళవారం అంగీకారం తెలిపారు. బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రి డీకే శివకుమార్ సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ప్రతిపక్ష నాయకులు పలు సందేహాలను వ్యక్తం చేశారు. బీజేపీ ఎమ్మెల్యేలు అశ్వత్థనారాయణ, సతీశ్‌రెడ్డి, సీకే రామమూర్తి సహా పలువురు వార్డుల విభజన సమంజసంగా లేదని, ఒక్కో పాలికెలు ఏడెనిమిది శాసనసభ నియోజకవర్గాలు, తూర్పు పాలికెలో కేవలం 2 శాసనసభ నియోజకవర్గాలు మాత్రమే ఉన్నాయని అభ్యంతరం తెలిపారు. సవరణల బిల్లుపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. చివరకు సభలో గ్రేటర్ బెంగళూరు అథారిటీకి సంబంధించి అభ్యంతరం లేదనేలా సవరణలు తీసుకొచ్చినట్టు డీసీఎం తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సరళీకృతం చేయాలని భావిస్తున్నామన్నారు. కాగా సీకే రామమూర్తి మాట్లాడుతూ ఢిల్లీ, ముంబైలలో గ్రేటర్ అథారిటీలు సఫలీకృతం కాలేదన్నారు. బెంగళూరు భవిష్యత్తు విషయంలో రాజకీయం చేసేది లేదని, అభివృద్ధి ముఖ్యమని డీసీఎం డీకే శివకుమార్ స్పష్టం చేశారు. శాసనసభలో గిగ్ కార్మికుల చట్టం 2025ను సామాజిక భద్రత, సంక్షేమం దిశగా ఆమోదించారు. రాష్ట్రంలో 4లక్షలమంది కార్మికులకు ఇది ప్రయోజనం కలగనుందని కార్మికశాఖ మంత్రి సంతోష్‌లాడ్ తెలిపారు.

వామ్మో వాన..!


లింగనమక్కి జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు


నిండిన ఆల్మట్టి జలాశయం

● రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వర్షాలు ● పలు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ● మూడోసారి నిండిన లింగనమక్కి ● ఆల్మట్టి నుంచి 2లక్షల క్యూసెక్కుల నీటి విడుదల

బెంగళూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా తీరప్రాంత, మలెనాడు, ఉత్తర కర్ణాటక జిల్లాల్లో భారీగా వర్షాలు కొనసాగుతున్నాయి. బెళగావి, హావేరి, ఉత్తరకన్నడ, ధారవాడ, విజయపుర, బీదర్ జిల్లాల్లో మంగళవారం భారీవర్షం కురిసింది. బెళగావి, హావేరి, ధారవాడ జిల్లాలలో బుధవారం కూడా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. శివమొగ్గ జిల్లా సాగర్ తాలూకా లింగనమక్కి జలాశయం నుంచి శరావతి నదికి 15వేల క్యూసెక్కులనీటిని వదిలారు. దీంతో జోగ్ జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. 61ఏళ్ల చరిత్రలో 23సార్లు లింగనమక్కి పూర్తిగా నిండింది. అయితే వరుసగా మూడేళ్లు నిండడం ఇదే తొలిసారి. 1819 అడుగుల సామర్థ్యం కలిగిన జలాశయంలో ప్రస్తుతం 1816.20 అడుగులకే నీరు చేరింది. జలాశయానికి 48,398 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా ఉంది. బెళగావి జిల్లాలోని గోకాక్ - శింగలాపుర బ్రిడ్జ్ ఘటప్రభ నది నీటిప్రవాహానికి నిండిపోయింది. ఉత్తరకన్నడ జిల్లా యల్లాపుర తాలూకా వజ్రళ్ళి గ్రామపంచాయతీ బీగార గ్రామంలో ఓ ఇల్లు కూలిపోయింది. ఆల్మట్టి జలాశయం నుంచి మంగళవారం సాయంత్రం 2లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో యలగూరు వద్ద కృష్ణానది పొంగిప్రవహిస్తోంది. ఉదయం 1.50 లక్షల క్యూసెక్కుల ఉన్న అవుట్‌ఫ్లోను మధ్యాహ్నం 1.75 లక్షల క్యూసెక్కులకు పెంచారు. సాయంత్రం 6 గంటలకు 2 లక్షల క్యూసెక్కులను విడుదల చేశారు. ఈ ఏడాది ఆల్మట్టి నుంచి నీరు విడుదల చేయడం ఇదే తొలిసారి. బీదర్ జిల్లా ఔరాద్ తాలూకాలో భారీ వర్షాలకు 15కుపైగా పశువులు కొట్టుకుపోయాయి. కొడగు, చిక్కమగళూరు జిల్లాల పరిధిలో వర్షంధాటికి జనం తల్లడిల్లుతున్నారు. చిక్కమగళూరు జిల్లా పరిధిలోని తుంగ, భద్ర, హేమావతి నదుల్లో1 నీటిమట్టం గణనీయంగా పెరిగింది. ఉడుపి జిల్లా కుందాపుర తాలూకా హొసంగడి సమీపంలో జాతీయ రహదారి వద్ద మట్టి చర్యలు విరిగిపడ్డాయి. హాసన్ జిల్లా సకలేశపుర తాలూకా దోణిగల్ వద్ద ఓ బండరాయి కుంగిపోవడంతో రోడ్డుపై సంచారాన్ని నిలిపివేశారు. కావేరికి అనుబంధమైన కేఆర్ఎస్ జలాశయం నుంచి ఇన్‌ఫ్లో 80వేల క్యూసెక్కులు ఉండగా అవుట్‌ఫ్లోను 1.02 లక్షల క్యూసెక్కులకు పెంచారు. రంగనతిట్టు పక్షిధామలో బోట్ల సంచారాన్ని నిలిపివేశారు.


చిక్కమగళూరు జిల్లా శృంగేరి వద్ద తుంగానది ప్రవాహం


మంగళూరులో జలమయమైన ఓ ప్రాంతం

ఎర్రచందనం తరలింపునకు యత్నం

● పుష్ప సినిమా తరహాలో టాటా సుమోలో..
● చామరాజనగర్ జిల్లాలో ఇద్దరి అరెస్టు

బెంగళూరు, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): పుష్ప సినిమా తరహాలో ఎర్రచందనం తరలింపునకు ప్రయత్నించిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. టాటా సుమో వాహనానికి వెనుక భాగాన మరమ్మత్తులు చేసుకుని అనుమానం రాకుండా ఎర్రచందనం రవాణాకు ప్రయత్నించిన ఇద్దరు దొంగలను చామరాజనగర్ జిల్లా పరిధిలోని సీఐడీ ఫారెస్టు సెల్ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. కొళ్ళేగాల తాలూకా సత్తెగాల గ్రామం వద్ద ఆగి ఉన్న సుమో వాహనాన్ని గుర్తించిన అటవీ శాఖాధికారులు సోదాలు చేశారు. వాహనానికి వెనుకభాగాన సీట్ల కిందిభాగంలో ఆల్ట్రేషన్ చేశారు. బాక్సుల తరహాగా మార్చుకుని అందులో ఎర్రచందనం దుంగలను భద్రపరచినట్లు గుర్తించారు. వాహనాన్ని పోలీసులు గుర్తించగానే ఇద్దరు దొంగలు తప్పించుకునే ప్రయత్నం చేయగా వెంటనే ఇద్దరిని అరెస్టు చేశారు. తబ్రేజ్‌ఖాన్, సాదిక్‌పాషాలు అరెస్టు అయిన వారుగా పోలీసులు ప్రకటించారు. సీఐడీ ఫారెస్టు సెల్ అధికారులు రంగంలోకి దిగి ఇద్దరు దొంగలతో పాటు 205 కేజీల 28 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసే నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

రోడ్డు పక్కన నవజాత శిశువు లభ్యం

రాయచూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకా కల్మాల సమీపం కల్లూరు గ్రామ శివారులో మంగళవారం రోడ్డు పక్కన మగ శిశువు కనిపించడం ఆందోళన కలిగించింది. దారి గుండా వెళ్లె వారు ఏడుపు విని శిశువును తీసుకెళ్లి పోలీసులకు అప్పగించారు. కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సనందించిన అనంతరం శిశువును జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి అప్పగించారు. శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. రూరల్ పోలీసులు తల్లిదండ్రుల ఆచూకీ కోసం దర్యాప్తు ప్రారంభించారు.


రోడ్డు పక్కన పడిన నవజాత శిశువు

కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో జనసురక్షా ప్రచారం

బెంగళూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణజిల్లా దొడ్డబళ్ళాపుర బ్లాక్ కొడిగేహళ్ళి గ్రామపంచాయతీలో కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జనసురక్షా సాచురేషన్ అభియానలో భాగంగా ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కెనరాబ్యాంకు ఎండీ, సీఈఓ సత్యనారాయణరాజు మాట్లాడుతూ పీఎంజేడీవై, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఏపీవై లాంటి బీమా పాలసీల ద్వారా ఎంతో ప్రయోజనం ఉందన్నారు. పీఎంజేజేబీవైలో కేవలం 436 రూపాయలకు, పీఎంఎస్‌బీఐవైలో రూ.20 నామమాత్రపు ప్రీమియం చెల్లించడం ద్వారా అత్యవసర సమయంలో ప్రయోజనం ఉంటుందన్నారు. ఆర్‌బీఐ బెంగళూరు రీజనల్ డైరెక్టర్ సోనాలిసేన్ గుప్త మాట్లాడుతూ కేవైసీ ద్వారా రికార్డులను సమగ్రంగా సమర్పించడం, ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాలను నమోదు చేయాలన్నారు. సైబర్ మోసాలకు సంబంధించి ఖాతాదారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. 9 గ్రామాల పరిధిలోని 700మందికిపైగా ఖాతాదారులు భాగస్వామ్యులయ్యారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ ఏజీఎం అరుణ్‌కుమార్, బెంగళూరు గ్రామీణ జిల్లా ఏడీసీ సైదాఈషా, పంచాయతీ ప్రెసిడెంట్ ఆశారాణితోపాటు కెనరబ్యాంకు బెంగళూరు సర్కిల్ జనరల్ మేనేజర్ మహేశ్, లీడ్‌బ్యాంకు వర్టికల్ జీఎం భాస్కర్ చక్రవర్తి, దేవనహళ్ళి విభాగం ఏజీఎం కృష్ణచైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కెనరాబ్యాంకు ఎండీ సీఈఓ సత్యనారాయణరాజు

కొండపై చిరుత ప్రత్యక్షం

కంప్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : విజయనగరం జిల్లా హొస్పేట తాలుకా పరిధిలోని ధర్మద కొండపై మంగళవారం సాయంత్రం చిరుత ప్రత్యక్షమైంది. పొలాలకు వెళ్లే రైతులు కొండపై చిరుత కనబడటంతో పరుగులు తీశారు. వారంలో రెండు మూడు సార్లుగా ఈ చిరుత కొండ ప్రాంతంలో గొర్రెల కాపరులకు రైతులకు కనిపించినట్లు తెలిపారు. చిరుత భయంతో రైతులు పొలాలకు వెళ్లాలంటే జంకుతున్నారు. బోను ఏర్పాటు చేసి చిరుతను బంధించాలని రైతులు కోరుతున్నారు.


ధర్మద కొండపై ప్రత్యక్షమైన చిరుత

సెల్‌ఫోన్ రిపేరీ కోసం వెళ్లి మృత్యువాత

ఆటో బోల్తాపడి విద్యార్థి మృతి


నందకిషోర్ (ఫైల్)

ముదిగుబ్బ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధనగారిపల్లి సమీపంలో సోమవారం రాత్రి ఆటో బోల్తాపడి పీసీరేవు గ్రామానికి చెందిన విద్యార్థి నందకిషోర్(14) మృతి చెందినట్లు ముదిగుబ్బ పోలీసులు తెలిపారు. సెల్‌ఫోన్ రిపేరీ కోసం నందకిషోర్ మరికొందరితో కలిసి ఆటోలో ముదిగుబ్బకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా సిద్ధనగారిపల్లి గ్రామ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన నందకిషోర్‌ను స్థానికులు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఆటో మిగిలిన ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతుడు ఉప్పలపాడు బాలుర పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగి మృతి

అనంతపురం క్రైం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్‌నగర్‌కు చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి వేణుగోపాల్(66) హౌసింగ్ బోర్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించారు. ఓ అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా తన భర్త మరణించారంటూ మృతుడి భార్య నాగరత్నమ్మ ట్రాఫిక్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తన భర్త వేణుగోపాల్ సోమవారం విద్యుత్ నగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి గుడికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. 8.30 గంటలప్పుడు కుమార్ ఆసుపత్రి వద్దకు రాగానే ఏపీ 39-టీఎస్5076 నెంబర్ అంబులెన్స్ కుడి వైపు డోర్‌ను డ్రైవర్ నిర్లక్ష్యంగా తెరవడంతో అది స్కూటర్‌కు తగిలి కింద పడి గాయపడ్డాడన్నారు. తొలుత కుమార్ ఆసుపత్రికి, తర్వాత సవీరా ఆసుపత్రికి తరలించామన్నారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మరణించారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు యాక్సిడెంట్‌కు సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలను సేకరించారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్ నిర్లక్ష్యం... బాలుడి దుర్మరణం

కనగానపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తల్లిమడుగుల గ్రామంలో ఓ టిప్పరు డ్రైవరు నిర్లక్ష్యం ఓ బాలుడు ప్రాణం తీసింది. స్థానికులు తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రం పావగడ తాలుకా సోలేపల్లికి చెందిన రామాంజనేయులు తన కుమారుడు వినయ్(7)తో కలిసి ద్విచక్ర వాహనంపై అనంతపురం నుంచి సొంతూరికి వెళుతున్నాడు. తల్లిమడుగుల వద్ద ముందు వెళుతున్న టిప్పర్ ఆగింది. దీంతో వెనకున్న రామాంజనేయలు తన ద్విచక్ర వాహనాన్ని నెమ్మదిగా పోనిచ్చాడు. అయితే ఎదురుగా మరో టిప్పరు రావడంతో అకస్మాత్తుగా టిప్పరు డ్రైవర్ తన వాహనాన్ని వెనకకు రివర్స్ చేశాడు. దీంతో వెనుక ద్విచక్రవాహనంపై ఉన్న తండ్రి, కొడుకు కింద పడ్డారు. టిప్పర్ వెనుకకు రావడంతో దానికింద పడి వినయ్ అక్కడికక్కడే మృతిచెందగా తండ్రి రామాంజనేయలు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెలవులో జడ్పీ సీఈఓ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ వారం రోజులపాటు వ్యక్తిగత పనులపై సెలవులో వెళ్లారు. దీంతో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సీఈఓ 10 రోజులపాటు సెలవు కోరితే వారం రోజులే మంజూరు చేశారన్న చర్చ జరుగుతోంది. ఈక్రమంలో మరోసారి సెలవు పొడిగించుకొనే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

మార్పు వద్దా..?

- మార్పు ద్వారా విజేతలు శిక్షణకు ఇద్దరే హాజరు..

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మహిళా ప్రజాప్రతినిధులను చైతన్యపరిచేందుకు ప్రభుత్వం చేస్తున్న యత్నాలు సఫలం కావడం లేదు. మార్పు ద్వారా విజేతలు.. మహిళా సాధికారితతో స్వపరిపాలన సాధ్యం అనే అంశంపై మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీలకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఇదివరకే రెండు విడతల్లో శ్రీ కాళహస్తిలో కొందరికి శిక్షణ ఇచ్చారు. అయితే మిగిలిన వారికి మంగళవారం నుంచి గురువారం వరకు జిల్లా కేంద్రంలో శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. దాదాపు 50 మంది దాకా వస్తారని అధికారులు అంచనా వేయగా గాండ్లపెంట, రాప్తాడు జడ్పీటీసీలు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన రెండు రోజులకు అయిన మహిళా సభ్యులు హాజరు కావాలని సమాచారం అందించారు. తమకు పదవీకాలం ఇక ఏడాదిలోపే ఉందన్న కారణంతో చాలా మంది శిక్షణకు రాలేదన్న ప్రచారం జరుగుతోంది.

24న టీటీసీ థియరీ పరీక్షలు

అనంతపురం విద్య, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): టీటీసీ థియరీ పరీక్షలు ఈనెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ వెంకటేష్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 24న ఉదయం 11 గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, మళ్లీ 3.30 నుంచి సాయంత్రం 4.30 గంటలవరకు మూడు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జిల్లాకేంద్రంలోని మొదటి రోడ్డులోగల శారదా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలు ఉంటాయన్నారు. హాల్‌టిక్కెట్ తోపాటు ఏదైనా గుర్తింపు కార్డుతో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

ధర్మవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం వేధింపుల ఫిర్యాదు మేరకు అత్తింటి వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన తుంగా రేఖకు, కొత్తపేటకు చెందిన రంగం ఆంజనేయులుతో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో 14 తులాల బంగారం ఇచ్చారు. ఆంజనేయులు పట్టుచీరల వ్యాపారం చేస్తున్నాడు. వీరికి పిల్లలు లేరు. పెళ్లయిన మూడునెలల వరకు వీరి కాపురం సజావుగా సాగింది. ఆ తరువాత ఆంజనేయులు వ్యసనాలకు బానిసయ్యాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడుతూ భార్య బంగారమంతా బ్యాంకులో తాకట్టు పెట్టాడు. విషయాన్ని తుంగా రేఖ.. అత్తమామలకు చెప్పినా వారు కూడా ఆంజనేయులుకు మద్దతు పలికారు. విషయాన్ని తుంగా రేఖ తన తల్లిదండ్రులకు చెప్పగా వారు పంచాయితీ పెట్టి చెప్పినా ఎటువంటి మార్పు రాలేదు. రెండేళ్లుగా భర్త, అత్తమామలు అదనంగా డబ్బులు కావాలని తుంగా రేఖను వేధిస్తుండేవారు. దీంతో రేఖ పుట్టింటికి వచ్చేసింది. అయినా ఆంజనేయులు వేధింపులు ఆగలేదు. వాటిని భరించలేక మంగళవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు ఆమె భర్త ఆంజనేయులు, అత్త లక్ష్మీదేవి, మామ రామచంద్రపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

పగలు బొగ్గులు.. రాత్రి దోపిడీలు

పాణ్యం ముఠాకు రాయచోటి వ్యక్తి సాయం

చెక్కవారిపల్లి నుంచి నెలకు సరిపడా సరుకులు

తనకల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): చెక్కవారిపల్లి అటవీ ప్రాంతంలో పట్టుబడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా వ్యవహారం కలకలం రేపుతోంది. అటవీ ప్రాంతంలో ఈ ముఠా ఆరు నెలలుగా గుడారాలు వేసుకుని ఉంటోంది. తనకల్లు, కదిరి రూరల్, పాణ్యం పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేసి వీరిని పట్టుకున్నారు. వారి కదలికలను గుర్తించేందుకు డ్రోన్‌ల నిఘా పెట్టారు. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన శేఖర్ అనే వ్యక్తి ద్వారా వీరు తనకల్లు మండలంలోని దిగువ చెక్కవారిపల్లికి చేరినట్లు సమాచారం. అక్కడి నుంచి నెల క్రితం అటవీప్రాంతానికి మకాం మార్చారు. వీరందరూ నంబులపూలకుంట మండలం పెడుల్లి వద్ద బొగ్గులు కాల్చే పనికి వెళ్లేవారు. వీరికి చెక్కవారిపల్లికి చెందిన ఓ వ్యక్తి ద్వారా ప్రతి నెలా తినడానికి కావలసిన సరుకులు వెళ్లేవని సమాచారం. రాయచోటికి చెందిన శేఖర్‌కు చెక్కవారిపల్లికి చెందిన ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. అతని ద్వారానే శేఖర్ దొంగల ముఠాకు సాయం అందించాడని సమాచారం. పగటిపూట బొగ్గులు కాల్చి, రాత్రిళ్లు దోపిడీలకు పాల్పడేవారని సమాచారం.

చేనేత కార్మికుడి అదృశ్యం


మురళి (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు మురళి అదృశ్యంపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇందిరమ్మకాలనీలో మురళి, కుంటిమద్ది రమ్య దంపతులు జీవిస్తున్నారు. మనస్పర్థల కారణంగా ఇటీవలిగా దంపతులు గొడవపడేవారు. మురళి మగ్గం పని గిట్టుబాటు కాక అప్పులు చేశాడు. వాటిని కట్టలేక ఇంట్లో భార్యతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో ఒకటిన్నర నెల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో రమ్య.. బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద గాలించింది. ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విడపనకల్లు వెళ్లాలంటే.. టిక్కెట్ కొనాల్సిందే..!

స్త్రీ శక్తికి దూరంగా మండలం

ఒక్క ఉచిత బస్సు సర్వీసూ నడపని ఆర్టీసీ

మహిళలపై భారం



బస్సు బోర్డుపై అంతర్రాష్ట్ర సర్వీసు అని రాసిన దృశ్యం

విడపనకల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ యోగం దక్కట్లేదు. ఒక్క ఉచిత బస్సు సర్వీసు కూడా లేకపోవడమే ఇందుకు కారణం. కర్ణాటక సరిహద్దులో మండలం ఉండడమే ఇందుకు కారణం. మండలం మీదుగా బళ్లారి, అనంతపురం మధ్య రోజూ వంద బస్సులుపైగా తిరుగుతుంటాయి. అవన్నీ ఎక్స్‌ప్రెస్‌లు, అల్ట్రా డీలక్స్ బస్సులే. రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీ బస్సులను ప్రకటించిన తరువాత ఈ బస్సులు అన్నింటికీ అంతర్రాష్ట్ర సర్వీసులుగా బోర్డులు తగిలించారు. దీంతో మండలంలోని మహిళలకు ఉచిత ప్రయాణ యోగం లేకుండా పోయింది. విడపనకల్లు నుంచి ఉరవకొండకు వెళ్లాలన్నా అంతర్రాష్ట్ర సర్వీసుల్లో టిక్కెట్ కొనాల్సిందే. అనంతపురం నుంచి విడపనకల్లు రావాలన్నా ఉరవకొండ వరకు మాత్రమే ఉచిత ప్రయాణానికి అవకాశం ఉంటుంది. అక్కడి నుంచి విడపనకల్లుకు టిక్కెట్ కొనాల్సిందే. విడపనకల్లుకు ఒక్క పల్లె వెలుగు సర్వీసు కూడా లేదు. విడపనకల్లు వరకూ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించాలని మండలానికి చెందిన మహిళలు కోరుతున్నారు.

విడపనకల్లుకు టిక్కెట్ తీసుకోవాల్సిందే

విడపనకల్లు మండలం కర్ణాటక సరిహద్దులో ఉండటంతో ఫ్రీ సర్వీసులు లేవు. ఉరవకొండ నుంచి విడపనకల్లు మీదుగా అన్ని బస్సులు బళ్లారికి వెళ్తుండటంతో అవి అంతర్రాష్ట్ర సర్వీసుల కిందకు వస్తాయి. వాటిలో ఉచిత ప్రయాణానికి అవకాశం లేదు. సరిహద్దు వరకు ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తే చర్యలు తీసుకుంటాం.

-హంపయ్య, డిపో మేనేజర్, ఉరవకొండ

ఉచిత ప్రయాణంతో మహిళల్లో ఆనందం

ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు

కళ్యాణదుర్గం (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పట్ల మహిళలు ఆనందంగా ఉన్నారని ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో, బస్టాండ్‌ను ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజుతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళల వద్దకెళ్లి ఉచిత ప్రయాణం ఎలా ఉందంటూ ఆర్టీసీ ఎండీ అడిగి తెలుసుకున్నారు. ఉచిత ప్రయాణంతో డబ్బులు ఆదా అవుతున్నాయనీ, ఎంతో సంతోషంగా ఉన్నామని వారు చెప్పారు. ఉచిత ప్రయాణంతో ఆక్యుపెన్సీ 93 శాతానికి పెరిగిందన్నారు. కొన్ని ఆర్టీసీ డిపోల్లో 106 శాతం ఆక్యుపెన్సీ వచ్చినట్లు తెలిపారు. కర్ణాటక సరిహద్దు మండలాలకు ఉచిత ప్రయాణం అమలు కావడంలేదనీ, అవకాశం కల్పించాలని ప్రయాణికులు.. ఆర్టీసీ ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం, సిబ్బంది పాల్గొన్నారు.


బస్సులో మహిళతో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ

తాడిపత్రి వైపు పెద్దారెడ్డి.. అడ్డుకున్న పోలీసులు

అనంతపురానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే


పోలీసులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

తాడిపత్రి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి వైపు వెళ్తున్నాడన్న సమాచారంతో పోలీసుల్లో హైటెన్షన్ వాతావరణం ఏర్పడింది. చుట్టుపక్కల పోలీసు స్టేషన్లతోపాటు సిబ్బందిని అలర్ట్ చేసి, ఆయా రహదారుల్లో అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పెద్దారెడ్డి మాత్రం యల్లనూరు మండలం తిమ్మంపల్లి నుంచి తాడిపత్రి వైపు రావడంతో బుక్కాపురం వద్ద పోలీసులు అడ్డగించారు. తాను అనంతపురం వెళ్తున్నానని చెప్పినా వారు ఒప్పుకోలేదు. ఆయన కాన్వాయ్ వెంబడే బయలుదేరారు. కొండాపురం సమీపంలో సూరేపల్లి వద్దకు రావడంతో పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. తాడిపత్రికి వెళ్లకూడదనీ, వెనక్కి వెళ్లాలని చెప్పినా ఆయన వినలేదు. కోర్టు అనుమతి ఉందనీ, తనను ఎందుకు అడ్డుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసులు మాత్రం ససేమిరా అన్నారు. అంతలోనే మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అనంతపురం నుంచి తిరిగి వస్తున్నాడని తెలియడంతో ఎదురుపడితే ఘర్షణ పడే అవకాశం ఉందన్న ఆలోచనతో పెద్దారెడ్డిని అరగంట ఆపారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి కొండాపురం దాటి వెళ్లిన తర్వాత అనంతపురం వైపు పెద్దారెడ్డిని పంపించారు. మళ్లీ వెనక్కి వస్తాడేమోనని పోలీసులు కాన్వాయ్‌తోపాటు అనంతపురం వరకు వెళ్లారు. ఆయన తిరిగి రాకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

కిటకిటలాడిన అంజన్న ఆలయాలు

గుంతకల్లు/బొమ్మనహాళ్/డీ.హీరేహాళ్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): శ్రావణమాస చివరి మంగళవారాన్ని పురస్కరించుకుని గుంతకల్లు సమీపంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం, బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయం, డీ.హీరేహాళ్ మండలంలోని మురడి ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. నెట్టికంటి మూల విరాట్టుకు వజ్రాలు పొదిగిన బంగారు ఆభరణాలతో అలంకరించారు. రాత్రి స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను వెండి రథంపై ఉంచి.. ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. నేమకల్లులో స్వామి వారికి తెల్లవారుజామున నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మురడి ఆంజనేయస్వామిని వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించారు.


కసాపురం


నేమకల్లు


మురడి

తహసీల్దార్ కార్యాలయంలోనే

వీఆర్‌ఏ ఆత్మహత్యాయత్నం

భూమి వివాదంలో వీఆర్వో, మునుపటి తహసీల్దార్ అన్యాయం చేశారని ఆరోపణ

నల్లచెరువు, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోనే ఓరువాయి వీఆర్‌ఏ రంగస్వామి మంగళవారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓరువాయి గ్రామానికి చెందిన వీఆర్‌ఏ రంగస్వామికి, దాయదులకు కొన్నేళ్లుగా భూవివాదం ఉంది. కోర్టుకు కూడా వెళ్లారు. సర్వే నంబరు 396/1, 396/2లో తనకు రావలసిన హక్కు భూమిని కూడా ఓరువాయి వీఆర్వో నిర్మల, గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన రవికుమార్ కలిసి మరొకరి పేరున పాసుపుస్తకం జారీ చేశారని బాధిత వీఆర్‌ఏ ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై అధికారుల వద్దమొరపెట్టుకున్నా, న్యాయం చేయలేదన్నారు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించానన్నారు. గమనించిన తోటి ఉద్యోగులు నల్లచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కదిరి ఆస్పత్రికి, అక్కడి నుంచి అనంతపురం ఆసుపత్రికి తరలించారు. భూవివాదంపై వీఆర్వో నిర్మల మాట్లాడుతూ.. రంగస్వామి భూమి వివాదం కోర్టులో నడుస్తోందన్నారు. కోర్టులోఉన్న భూమికి ఇంజక్షన్ ఆర్డర్ లేకపోవడంతో ఉన్నతాధికారుల సలహా మేరకు క్షేత్రస్థాయిలోకి వెళ్లి సర్వే చేశామన్నారు. రంగస్వామి సాగు విస్తీర్ణం కంటే అండగళ్‌లో ఎక్కువ భూమిని ఎక్కించుకున్నారన్నారు. రంగస్వామి దాయాదులు, పెద్ద మనుషుల సమక్షంలో హక్కు ఉన్న మేరకు పాసుపుస్తకంలో ఎక్కించామన్నారు.


కదిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీఆర్‌ఏ రంగస్వామి

డాక్టర్ కత్తి పద్మారావుకు

జీవిత సాఫల్య పురస్కారం



అనంతపురం టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసి చేసిన సాహితీవేత్త, సంస్కృతాంధ్ర పండితులు డాక్టర్ కత్తి పద్మారావును విమలాశాంతి సాహిత్య జీవిత సాఫల్య పురస్కారం వరించింది. 2025 సంవత్సరానికి ఆయనను పురస్కారానికి ఎంపిక చేశారు. రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి(రాయలసీమ), కేపీ అశోక్‌కుమార్(తెలంగాణ), గంటేడ గౌరునాయుడు(కోస్తా) న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి, డాక్టర్ కత్తి పద్మారావును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతపురం జిల్లా కేంద్రంలో త్వరలో పురస్కార ప్రదానోత్సవం నిర్వహిస్తామని విమలాశాంతి సాహిత్య సామాజిక సేవాసమితి వ్యవస్థాపకులు డాక్టర్ శాంతినారాయణ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. డాక్టర్ కత్తి పద్మారావుకు పురస్కారం, నగదు బహుమతి అందజేసి సత్కరిస్తామని ఆయన తెలిపారు.

హిందూపురంలో

వందే భారత్ ఆగుతుంది: సోమన్న

బర్కత్‌పుర, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నగరం నుంచి హిందూపూర్ వెళ్లే ప్రయాణికులకు శుభావార్త చెప్పారు కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్న. కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి యశ్వంత్‌పూర్‌కు వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు (20703) హిందూపూర్‌లో ఆగుతుందని (హాల్టింగ్) మంత్రి ట్విట్టర్‌లో పేర్కొన్నారు. దీనిని రైల్వే బోర్డు ఆమోదించినట్లు తెలిసింది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఉదయం 5.45 నిమిషాలకు బయల్దేరి మహబూబ్‌నగర్‌కు ఉదయం 6.54 నిమిషాలకు కర్నూలు ఉదయం 8.28 నిమిషాలకు, అనంతపురానికి ఉదయం 10.43 నిమిషాలకు, ధర్మవరానికి ఉదయం 11.10 నిమిషాలకు చేరుతుంది. హిందూపూర్‌కు ఉదయం 11.40 నిమిషాలకు చేరే అవకాశం ఉంటుంది. ఈ రైలు యశ్వంత్‌పూర్‌కు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్‌లో మధ్యాహ్నం 2.45 నిమిషాలకు బయల్దేరి రాత్రి 11గంటలకు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది. ఏ తేదీ నుంచి వందే భారత్ రైలు హిందూపురంలో ఆగుతుందో దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించాల్సి ఉంది.

చిరుజల్లులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం చిరుజల్లులు పడ్డాయి. అనంతపురం, కూడేరు, శింగనమల, విడపనకల్లు, బొమ్మనహాళ్, గుత్తి, పుట్లూరు, పామిడి, గార్లదిన్నె మండలాల్లో చిరుజల్లులు రాలాయి. సోమవారం 18 మండలాల్లో వర్షం పడింది. బెళుగుప్పలో 0.64 సెం.మీ., యాడికి, కళ్యాణదుర్గం 0.60, బ్రహ్మసముద్రం 0.52, తాడిపత్రి 0.42, బుక్కరాయసముద్రం 0.32, డి హిరేహాళ్ 0.24, రాయదుర్గం, కూడేరు 0.22, విడపనకల్లు 0.2, గుత్తి, గుమ్మఘట్ట 0.18, గుంతకల్లు, పామిడి, యల్లనూరు 0.14 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 0.12 సెం.మీ. లోపు కురిసింది.

పోక్సో కేసులో పదేళ్ల జైలు

హిందూపురం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): బాలికను బెదిరించి, అత్యాచారం చేసిన కేసులో ముద్దాయి సుధాకర్‌కు అనంతపురం పోక్సో కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. హిందూపురం పట్టణంలోని లక్ష్మీపురంలో ఉంటున్న వడ్డె సుధాకర్ 2022 జనవరి 7న 15 ఏళ్ల బాలికకు మాయ మాటలు చెప్పి బెంగళూరుకు, అక్కడి నుంచి కదిరికి తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో వన్‌టౌన్ సీఐ ఇస్మాయిల్, ఎస్ఐ దాదాపీర్ కేసు నమోదు చేశారు. బెంగళూరులో ఉన్న సుధాకర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణలో నేరం రుజువైందని న్యాయాధికారి చిన్నబాబు ప్రకటించారు. అత్యాచారం చేసినందుకు పదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా, బాలికను బెదిరించినందుకు మరో మూడేళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధించారు. బాధితురాలి తరఫున ఏపీపీ లక్ష్మీనారాయణ వాదించారు. దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సీఐ, ఎస్ఐని ఎస్పీ రత్న అభినందించారు.

ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ పరిధిలోని బీ ఫార్మసీ, ఫార్మా డీ, బీబీఏ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదల చేశారు. డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్ నాయుడు, ప్రొఫెసర్లు శివకుమార్, శంకరశేఖర్ రాజు, శ్రీధర్, అంకారావు ఫలితాలను వెల్లడించారు. బీ ఫార్మసీ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు, ఫార్మా డీ మూడో సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ, బీబీఏ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ రెగ్యులర్, ఒకటో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు, ఎమ్మెస్సీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. జేఎన్‌టీయూఏ వెబ్ సైట్‌లో ఫలితాలు చూసుకోవచ్చని ఆచార్య నాగప్రసాద్ నాయుడు తెలిపారు.

13న జాతీయ లోక్ అదాలత్

అనంతపురం క్రైం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ సెప్టెంబరు 13న నిర్వహించనున్నట్లు శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదన్‌లో జాతీయ లోక్ అదాలత్‌పై అన్నిశాఖల అధికారులతో వారు మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్‌లో ఉచిత ప్రజాప్రయోజన వ్యాజ్య న్యాయ సేవలు వినియోగించుకోవాలన్నారు. వచ్చే నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎంబీఓపీ కేసులు, కొళాయి పన్ను కేసులు, ఇంటి పన్ను కేసులు, బీఎస్ఎన్ఎల్ కేసులు రాజీ చేయాలని అధికారులకు సూచించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశ గడువు పొడిగింపు

కొత్తచెరువు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ప్రవేశ గడువును సెప్టెంబరు 15 వరకు పొడిగించినట్లు ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ లాజర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి పదో తరగతిలో చేరే వారికి 14 సంవత్సరాలు, ఇంటర్‌లో చేరే వారికి 15 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఈ అవకాశం అపరాధ రుసుం రూ.200 చెల్లించిన వారికి మాత్రమే లభిస్తుందన్నారు. సమాచారం కోసం ఏఐ సెంటర్‌ను సంప్రదించాలన్నారు.

పురంలో అదృశ్యం.. కర్ణాటకలో మృతి


అర్చన (ఫైల్)

హిందూపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకంఠపురం కాలనీకి చెందిన అర్చన(27) కర్ణాటకలో మృతిచెందారు. ఈ నెల 13న క్యాటరింగ్ పనులకు వెళ్లిన అర్చన ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భర్త నాగరాజు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా, కర్ణాటకలోని మంచేపల్లిలో గుర్తు తెలియని మహిళ మృతిచెందినట్లు అక్కడి పోలీసులు మంగళవారం సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి.. మృతదేహం అర్చనదేనని గుర్తించారు. ఆమెకు ఇన్‌స్టాలో ఒకరు పరిచయమయ్యారని, అతనే హత్య చేసి ఉంటాడని అనుమానిస్తున్నారు. అర్చనకు రెండేళ్ల కూతురు ఉంది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని సీఐ కరీం అన్నారు.

గొలుసు లాక్కెళ్లిన కేసులో ఇద్దరి అరెస్టు


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్కూటీలో వెళ్తున్న మహిళ మెడలోని గొలుసు లాక్కెళ్లిన కేసులో ఇద్దరు నిందితులను త్రీటౌన్ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి గొలుసు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక స్టేషన్‌లో త్రీటౌన్ సీఐ శాంతిలాల్ వెల్లడించారు. కంబం నాగార్జున (25) అలియాస్ నాగార్జున రెడ్డి అలియాస్ చిన్నా ఆటో డ్రైవర్. శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ సొంతూరు. అనంతపురంలోని కలెక్టరేట్ వద్ద నివాసం ఉంటున్నాడు. పేకాట, తాగుడుకు బానిసయ్యాడు. ఆన్‌లైన్ జూదంలోనూ డబ్బులు పోగొట్టుకున్నాడు. జల్సాల కోసం చేసిన అప్పులు తీర్చలేకపోయాడు. అతడి స్నేహితుడు శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడకు చెందిన బోజనోల వరప్రసాద్ కదిరిలో నివాసం ఉంటున్నాడు. నాగార్జున.. ఫ్రెండ్ వరప్రసాద్‌ను పిలిచి సులభంగా డబ్బు సంపాదించేందుకు చైన్ స్నాచింగ్ చేద్దామంటూ సలహా ఇచ్చాడు. ఇద్దరూ ఈ ఏడాది జూన్ 21న నేషనల్ పార్కు వద్ద చైన్ స్నాచింగ్‌కు ప్లాన్ వేసుకున్నారు. అక్కడ స్కూటీపై ఇద్దరు మహిళలు వెళ్తుండగా వెంబడించారు. స్కూటీ దగ్గరకు వెళ్లి స్కూటీ వెనుక చక్రంలో గాలి తగ్గిందంటూ చెప్పారు. మహిళ స్కూటీ ఆపి, కిందకు దిగి చూస్తుండగానే.. ఆమె మెడలోని బంగారు తాళి బొట్టు చైన్ లాగేసుకుని పారిపోయారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన సీఐ శాంతిలాల్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది ఆర్టీసీ స్టాండ్ వద్ద నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 23 గ్రాముల బంగారు చైన్, 1.5 గ్రాముల బంగారు తాళిగొట్టు, బంగారు లక్ష్మీ కాసు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు?

కదిరి అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమనాయునిపాళ్యం వద్ద గంజాయి విక్రయిస్తున్న వారిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి దాదాపు 7 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గంజాయి ఎక్కడనుంచి వస్తోంది, ఎవరికి విక్రయిస్తున్నారన్న దానిపై పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

వడిసలమ్మకు విశేష పూజలు



మడకశిర టౌన్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమరాపురం బస్టాండ్ ఆవరణలో వెలసిన వడిసలమ్మ దేవాలయంలో అమ్మవారు మంగళవారం ప్రత్యేకంగా రంగురంగు పూల అలంకరణలో కొలువుదీరారు. శ్రావణ మాసం చివరి మంగళవారం కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని విశేషంగా అలంకరణ చేసి పూజలు చేశారు. కొల్హాపురమ్మ, గంగాభవాని, పూజమ్మ, మూలకంఠేశ్వరి తదితర అమ్మవార్లకు దీపారాధన విశేష పూజలు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

తుమ్మల మారెమ్మకు..




గుడిబండ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మల మారెమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

నారాయణ గురు (జయంతి)



కేరళకు చెందిన సంఘ సంస్కర్త నారాయణ గురు 1856 ఆగస్టు 20న ట్రావెన్‌కోర్ ప్రాంతంలో జన్మించారు. సమాజంలోని మూఢ విశ్వాసాలను, కులతత్వాన్ని నిరసించారు. కులం కారణంగా కొన్ని వర్గాలకు చెందిన ప్రజలు అన్యాయానికి గురవుతున్నారని, వారికి ఆధ్యాత్మిక స్వేచ్ఛ, సామాజిక స్వాతంత్ర్యం ఉండాలని భావించారు. వారిని ఉద్ధరించడానికి ఆలయాలు, పాఠశాలలు మొదలైనవి నెలకొల్పేందుకు పాటుపడ్డారు. సంస్కృతం, జ్యోతిష్యం, ఆయుర్వేదంలోనూ ప్రవేశం ఉండేది. ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు ఎంతో కృషి చేశారు. 1928 సెప్టెంబరు 20న కన్నుమూశారు. 1986లో ఆయన పేరిట ఒక సినిమా వచ్చింది. నేటికీ ఆయన తరఫు సంఘాలు ఇతోధికంగా కృషి చేస్తున్నాయి.

పద్మనాభం (జయంతి)



తెలుగు సినీరంగంలో తనదైన గుర్తింపు పొందిన పద్మనాభం 1931 ఆగస్టు 20న కడప జిల్లా పులివెందుల తాలూకా సింహాద్రిపురంలో జన్మించారు. పూర్తి పేరు బసవరాజు వెంకట పద్మనాభ రావు. రంగస్థల నటుడి నుంచి వెండితెరకు పరిచయమయ్యారు. సినీ నిర్మాత, దర్శకుడిగాను వ్యవహరించారు. జానపద, పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో వివిధ పాత్రల్లో సుమారు 400 సినిమాల్లో నటించారు. నంది అవార్డు, అల్లు రామలింగయ్య నేషనల్ అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. 2010 ఫిబ్రవరి 20న కన్నుమూశారు.

రాజీవ్‌గాంధీ (జయంతి)



రాజీవ్‌గాంధీ 1944 ఆగస్టు 20న ముంబైలో జన్మించారు. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మనవడు, ఇందిరాగాంధీ కుమారుడు. కాంగ్రెస్ పార్టీలో కీలక హోదాలలో కొనసాగారు. తల్లి హత్యానంతరం పిన్నవయస్సులోనే అనగా 40వ యేట ప్రధానమంత్రి అయ్యారు. ఆరో ప్రధానిగా 1984 నుంచి 1989 వరకు కొనసాగారు. దేశం ఆధునిక దిశగా సాగేందుకు పలు బాటలు వేశారు. శ్రీపెరంబుదూరులో 1991 మే 21న హత్యకు గురయ్యాడు. మరణానంతరం ఆయనకు అత్యున్నత ‘భారతరత్న’ ప్రకటించారు. కాగా ఆయన సతీమణి సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీలో కీలకహోదాలో కొనసాగుతున్నారు.

వి. రామకృష్ణ (జయంతి)



విస్సంరాజు రామకృష్ణ దాసు 1947 ఆగస్టు 20న జన్మించారు. 1970వ దశకంలో పేరొందిన తెలుగు సినిమా నేపథ్య గాయకుడు. 20 సంవత్సరాల సినీ జీవితంలో 200 సినిమాలలో ఐదువేలకుపైగా పాటలు పాడారు. తాతా మనవడు, భక్త తుకారాం, అల్లూరి సీతారామరాజు, దానవీర శూరకర్ణ తదితర సినిమాలలో ఆయన పాటలు పాడారు. ఎక్కువగా కేవీ మహదేవన్, పెండ్యాల వంటి సంగీత దర్శకులతో పనిచేశారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, శోభన్‌బాబు, కృష్ణంరాజు తదితర నటులకు పాటలు పాడారు. తన సుమధుర గాత్రంతో అపర ఘంటసాలగా పేరొందిన ఆయన 2015 జూలై 16న కన్నుమూశారు.

బీకేఎస్ అయ్యంగార్ (వర్ధంతి)



యోగా గురువు ‘పద్మ విభూషణ్’ గ్రహీత బెళ్ళూరు కృష్ణమాచార్ సుందరరాజ అయ్యంగార్ 1918 డిసెంబరు 14న కోలారు ప్రాంతంలో జన్మించారు. యోగాలో ఆయన ప్రవేశపెట్టిన పద్ధతులు ‘అయ్యంగార్ యోగా’గా పేరొందాయి. ఆధునిక యోగా పితామహగా పేరొందిన తిరుమలై కృష్ణమాచార్య వద్ద విద్యాభ్యాసం చేశారు. యోగా, ఫిలాసఫీపై పలు పుస్తకాలు రాశారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ పురస్కారాలు పొందారు. 2014 ఆగస్టు 20న కన్నుమూశారు.

మానవీయ చిత్రాలతో ఉత్తమ ఫొటోగ్రాఫర్ కావచ్చు

» సీఎం మీడియా సలహాదారు కేవీ ప్రభాకర్



ప్రెస్‌క్లబ్‌లో వరల్డ్ ఫొటోగ్రఫీ డే వేడుకలు

బెంగళూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఫొటోలంటే కార్యక్రమాలు లేదా ఇతరత్రా సన్నివేశాలలో తీసేవి అధికంగా ఉంటాయి. కానీ ఓ ఫొటో మానవత్వాన్ని కదిలించేలా ఉంటే ఉత్తమ ఫొటోగ్రఫీకి నిదర్శనం అవుతుందని సీఎం మీడియా సలహాదారుడు కేవీ ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. వరల్డ్ ఫొటోగ్రఫీ డేను పురస్కరించుకుని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ వంద పదాలకు ఒక ఫొటో నిరూపిస్తుందన్నారు. ఆఫ్రికాలోని ఓ ఫొటో ఇప్పటికీ చర్చనీయాంశంగా ఉందన్నారు. ఫొటోగ్రఫీ, పత్రికారంగం అవినాభావ సంబంధాలు కలిగినవన్నారు. 20ఏళ్లక్రిందట ఫొటగ్రఫీ ప్రస్తుతంలా సులభతరంగా ఉండేది కాదన్నారు. ఫొటోగ్రాఫర్‌లకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. డెక్కన్‌హెరాల్డ్ సంస్థ ముఖ్యులు శాంతకుమార్, మీడియా అకాడమీ చైర్మన్ ఆయేషాఖానం, సీనియర్ ఫొటో జర్నలిస్ట్ భాగ్యప్రకాశ్, ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ చైర్మన్ మోహన్, సీనియర్ పాత్రికేయులు సదాశివషెణై, హౌసింగ్ శాఖ మంత్రి సలహాదారులు లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా విధానసౌధ బాంక్వెట్‌హాల్‌లో ఏర్పాటు చేసిన హిరేబెనకల్ ప్రకృతి చరిత్ర చిత్రాల ప్రదర్శనను సీఎం సిద్ధరామయ్య, పర్యాటకశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ తదితరులు వీక్షించారు.



విధానసౌధ బాంక్వెట్ హాల్‌లో చిత్రాలను తిలకిస్తున్న సీఎం సిద్ధరామయ్య తదితరులు

ఫ్రీడం పార్కులో నిరసనల వెల్లువ

బెంగళూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఫ్రీడంపార్కులో ప్రతిరోజూ పలు సంస్థలు, సంఘాలు సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తుంటారు. మంగళవారం అన్‌ఎయిడెడ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కన్నడ పాఠశాలలకు మనుగడ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలు రిజర్వేషన్‌లలో తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. బెంగళూరు నగర పరిధిలో పాములు పట్టేవారు ఆందోళన చేశారు. నగరంలో పాములనుంచి ఎవరికీ ఇబ్బంది కలగకూడదనే కొన్నేళ్లకాలంగా ఇదే వృత్తిని పాటిస్తున్నామని జీవనాధారం కోసం వెసలుబాటు కల్పించాలని నిరసన తెలిపారు.



అన్‌ఎయిడెడ్ విద్యాసంస్థల అసోసియేషన్ పదాధికారులు



నిరసన తెలుపుతున్న పాములు పట్టేవారు



ఆదివాసీల నిరసన

సమాజంలో నైతికతపై చర్చాగోష్టి

బెంగళూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జైన్ డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటీ స్కూల్, కర్ణాటక దక్షిణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జయనగర్‌లోని వర్సిటీ క్యాంపస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సమాజంలో నైతికత నీతి, పరిశోధనా మార్గాలు అనే అంశంపై చర్చాగోష్టి జరిగింది. 250 మందికిపైగా విద్యార్థులు, బోధన, బోధనేతర వర్గం, పారిశ్రామిక నిపుణులు పాల్గొన్నారు. డాక్టర్ శ్రద్ధా కాన్వర్, బెంగళూరు ఐఐఎస్‌సీకి చెందిన ప్రొఫెసర్ సతీశ్ వి కైలాస్, డాక్టర్ ప్రదీప్త బిస్వాస్, యాక్షన్ ల్యాబ్స్‌కు చెందిన సుభాష్ ఠాకూర్‌లే ఏఐ, చాట్‌జీపీటీ, కో-పైలట్ వంటి అంశాలపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రస్తుత తరుణంలో ఏఐ తనదైన ప్రభావం చూపుతోందన్నారు.



చర్చాగోష్టిలో పాల్గొన్న ప్రముఖులు

చోరీ కేసులో బంగారం రికవరీ



స్వాధీనం చేసుకున్న నగలతో పోలీసులు

» మహిళల సహా ఆరుగురు నిందితుల అరెస్టు

బంగారపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): బురఖా ధరించి నగలు చోరీ చేసిన కేసులో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడిని అరెస్టు చేసి, చోరీ సొత్తును రికవరీ చేశారు. బంగారపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నగలు కొనుగోలు చేసే నెపంతో ఆభరణాలను చోరీ చేసిన కేసును చేధించారు. ఐదుగురు మహిళలు, ఒక పురుషుడిని అరెస్టు చేసి 305 గ్రాముల నగలు, రూ.7,74,500 నగదు, చోరీకి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ పాండురం మార్గదర్శకంలో పోలీసులు కార్యాచరణ నిర్వహించారు. కోలారుకు చెందిన నగీనా (45), నవీన (33), ముబినా తాజ్ (25), నగ్మా (25), జరీనా తాజ్ (36), నజీర్‌పాషా (38)లను అరెస్టు చేశారు. నగలు, నగదు, ఆటో విలువ మొత్తం రూ.30లక్షల విలువ ఉంటుందన్నారు. పోలీసుల కార్యాచరణను జిల్లా ఎస్పీ ప్రశంసించారు.

వైభవంగా ఆంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ

మడకశిర రూరల్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీ పల్లి గ్రామంలో అభయ ఆంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ మంగళవారం వైభవంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండమల తిప్పేస్వామి.. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు..

కల్లూరులో కార్డెన్ సెర్చ్

లేపాక్షి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు మంగళవారం మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ నరేష్ తన సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో రౌడీషీటర్ల ఇళ్లను సోదాలు చేశారు. గతంలో కర్ణాటక మద్యం అమ్ముతున్న వ్యక్తుల ఇళ్లను, పరిసరాల్లో సోదాలు నిర్వహించారు.

యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక చేయూత



శిబిరంలో యూనియన్‌బ్యాంకు ఉన్నతాధికారులు

బెంగళూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉత్తర విభాగం చిక్కబళ్ళాపురశాఖ ఆధ్వర్యంలో ఆర్థికచేయూత (ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్) కార్యక్రమం నిర్వహించారు. ముంబై సెంట్రల్ కార్యాలయం సీజీఎం రవీంద్రబాబు, బెంగళూరు సర్కిల్ అధికారి సుధీర్, ప్రాంతీయ కార్యాలయం మేనేజర్ సుధీర్, గాలి రామప్రసాద్‌తోపాటు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాశ్, సరితా, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీజీఎం రవీంద్ర బాబు మాట్లాడుతూ.. ఖాతాదారులకు పీఎంజేడీవైతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పాలసీలను అనుసంధానం చేయడం, అవసరమైన వారికి రుణాలు సమకూర్చడంలో జాప్యం లేకుండా యూనియన్‌బ్యాంకు సేవలు అందిస్తోందన్నారు.

పేదలకు సాయంతో పుట్టిన రోజుకు సార్థకత



రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

మహదేవపుర, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పుట్టినరోజు వంటి సందర్భాలను పేదలకు సాయం చేయడం ద్వారా అర్థవంతంగా ఆచరించుకోవడం ద్వారా సార్థకత సాధ్యమని ఈఎల్‌వీ గ్రూప్ విద్యాసంస్థల ముఖ్యులు, ఫౌండేషన్ సంస్థాపక అధ్యక్షుడు ఈ భాస్కర్ అభిప్రాయపడ్డారు. ఫౌండేషన్ ద్వారా బియ్యం, బేడలు, చక్కెర ఇతర నిత్యావసరాలు ఇస్తున్నామన్నారు. గిఫ్టులు, పుష్పగుచ్ఛాలకు బదులు ఫౌండేషన్‌కు విరాళాలు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందచేసి అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర పరిషత్ సభ్యుడు ఎల్ రాజేశ్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీ మునిస్వామి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

22 నుంచి వాగ్దేవి కళా ఉత్సవ్

బెంగళూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పురాతన సనాతన భవ్య భారత అనే శీర్షిక కింద ఈనెల 22 నుంచి రెండురోజుల పాటు మారతహళ్ళి మున్నేకొళాలలోని వాగ్దేవి విలాస విద్యాసంస్థలో కళా ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ కే హరీష్ ప్రకటించారు. మంగళవారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. భారతీయ కళలు, చరిత్ర పరంపరకు అనుగుణంగా 50కు పైగా పోటీలు ఉంటాయన్నారు. బెంగళూరు నగర, గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి 100కు పైగా విద్యాసంస్థల నుంచి విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ ఎఎస్ కిరణ్‌కుమార్ ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు. సంస్కృత భాషా నిపుణుడు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత జగద్గురు రమానందాచార్యకు ప్రత్యేకంగా వేదిక నుంచి సత్కారం చేయదలచినట్లు ప్రకటించారు. గాయన, చిత్రకళలు, నృత్యం, సంగీతం, నాటికతో పాటు కళలకు సంబంధించిన ప్రదర్శనలు ఉంటాయని ప్రకటించారు.

పార్థీనియం మొక్కలతో జాగ్రత్త

శిడ్లఘట్ట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో స్థానికంగా గబ్బు మొక్కలుగా పిలిచే పార్థీనియం మొక్కలపట్ల అప్రమత్తంగా ఉండాలని బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయ వారోత్సవంలో భాగంగా కొత్తనూరు గ్రామంలో జాగృతి సమావేశం నిర్వహించారు. ఏఐసీఆర్‌పీ వీడ్ మేనేజి మెంటక్ల సహకారంతో కార్యక్రమం చేపట్టారు. పార్థీనియం మొక్కలను పొర పాటున పశువులు తింటే అలర్జీ, ఇతరత్రా సమస్యలు తలెత్తుతాయని సూచించారు. జూనియర్ అగ్రోనమిస్ట్ డాక్టర్ కమలాబాయి మాట్లాడుతూ పార్థీనియం మొక్కల నిర్మూలనకు ప్రజలు సహకరించాలన్నారు. పార్థీనియం మొక్కలను తొలగించి వాటి ప్రదేశంలో ఎరువుకు ఉపయోగించే మొక్కలు పెంచాలని సూచించారు. జాగృతిలో గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

వరద నీటిలో మునిగిన శీలహళ్ళి వంతెన

● నాలుగు గ్రామాల ప్రజలకు తప్పని తిప్పలు



నీట మునిగిన శీలహళ్ళి వంతెన

రాయచూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిలో వరద ప్రవాహం పెరగడంతో జిల్లా సరిహద్దులో శీలహళ్ళి వద్ద నిర్మించిన వంతెన మంగళవారం మునిగిపోయింది. దీంతో వంతెన ఆవలవైపు ఉన్న నాల్గైదు గ్రామాల ప్రజలు జాలహళ్ళి మీదుగా దాదాపు తాలూకా కేంద్రం చేరేందుకు 45 కి.మీ దూరం ప్రయాణించే పరిస్థితి తలెత్తింది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఆలమట్టి జలాశయానికి 1,80,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా దాదాపు అంతే స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో జిల్లా సరిహద్దు నారాయణపూర్ జలాశయానికి పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతుండగా 30 గేట్‌లను ఎత్తి దిగువకు 1,74,500 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. కృష్ణా నది తీర గ్రామాల ప్రజలకు ఇప్పటికే తాలూకా స్థాయి అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. శీలహళ్ళి వంతెన మునిగడంతో అటువైపు రాకపోకలను పూర్తిగా నిషేధించిన అధికారులు వంతెనకు ఇరువైపుల పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి అటువైపు ఎవ్వరు వెళ్లకుండా నిషేధాజ్ఞలు విధించారు.

అంజనాద్రిపై భక్తుల సందడి



అంజనాద్రిపై హనుమాన్ మాలధారులు

బళ్లారి సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం ఆఖరి మంగళవారం కావడంతో అంజనాద్రి కొండ భక్తులతో కిటకిటలాడింది. ఈసందర్భంలో హనుమ భక్తుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ బళ్లారిలో హనుమ మాలధరించిన భక్తులు బళ్లారి నుంచి మూడు బస్సుల్లో జై హనుమాన్ జన్మస్థలమైన అంజనాద్రిని దర్శించుకున్నామన్నారు. ఏటా సంవతమ మిత్రబృందంతో పవిత్రమైన హనుమాన్ మాల ధరిస్తామన్నారు. విద్యానగర్‌లోని గంగా మాత దేవాలయంలో తీర్థప్రసాదాలు స్వీకరిస్తామన్నారు.

తుర్విహాళ్ పంచాయతీ కార్యవర్గం ఏకగ్రీవం

రాయచూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు తాలూకా తుర్విహాళ్ పట్టణ పంచాయతీ ఎన్నికలు మంగళవారం శాంతియుతంగా పూర్తి చేశారు. పట్టణ పంచాయతీ చివరి టర్మ్‌కు సంబంధించి అధ్యక్షుడిగా బాపుగౌడ దేవరమని, ఉపాధ్యక్షురాలుగా లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. 14 మంది సభ్యులు గల పట్టణ పంచాయతీలో 13 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే ఉండగా చివరి టర్మ్ అధ్యక్ష స్థానం పై తీవ్ర ఉత్కఠ నెలకొంది. గడచిన వారం రోజులుగా స్థానిక(సింధనూరు) ఎమ్మెల్యే బసనగౌడ తుర్విహాళ్ వివిధ వర్గాల వారితో పట్టణంలో సమాలోచనలు జరిపిన అనంతరం బాపుగౌడ దేవరమనిని అధ్యక్షుడిగా ఎంపిక చేసేందుకు నిర్ణయించారు. కాగా ఉపాధ్యక్షురాలిగా ఎంపికైన లక్ష్మి ఇదే పట్టణ పంచాయతీలో పౌర కార్మికులుగా సేవలందించిన దివంగత నరసప్ప కూతురు కావడం విశేషం. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె పౌర కార్మికుల సంక్షేమానికి తాను తొలి ప్రాధాన్యతనిస్తానన్నారు. ఒక కార్మికుడి కూతురుగా ఉన్న తనకు ఉపాధ్యక్ష స్థానం దక్కడం సంతోషకరమన్నారు. ఈ విషయంలో సహకరించిన సభ్యులకు, ఎమ్మెల్యే ఇతర పార్టీ పెద్దలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న సభ్యులు

ఆగిన స్థిరాస్తి వ్యాపారం

● జిల్లాల పునర్విభజన చర్చ ఎఫెక్ట్

● కొనేవారు ఉన్నా.. అమ్మేవారు లేరు

హిందూపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడ్డాక స్థిరాస్తి వ్యాపారం కొంత ముందుకు కదిలింది. ముఖ్యంగా హిందూపురం పట్టణంలో ఉద్యోగులు, వ్యాపారులు ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకొచ్చారు. దీంతో గత వైసీపీ కాలంతో పోలిస్తే యేడాది కాలంగా ప్రతి వీధిలో ఏదో ఓ ప్రాంతంలో కొత్తిల్లు నిర్మాణం జరుగుతోంది. కొద్దిరోజులుగా హిందూపురంలో స్థిరాస్తి వ్యాపారం మందగించింది. ఇందుకు ప్రధాన కారణం జిల్లాల పునర్విభజన జరుగుతాయని, జిల్లాకేంద్రాలుగా మారవచ్చని చర్చ జనంలోకి రావడంతో కొనేవారున్నా అమ్మేవారు వెనుకడుగు వేస్తున్నారు. దీనివల్ల హిందూపురంలో ప్లాట్ల క్రయవిక్రయాలు చాలావరకు తగ్గినట్లు రిజిస్ట్రేషన్‌శాఖ లెక్కలుచెబుతున్నాయి.

జిల్లాల పునర్విభజన చర్చే కారణమా?

నూతనంగా ఏర్పడిన శ్రీసత్యసాయిజిల్లాలో అతిపెద్దపట్టణం హిందూపురమేనని చెప్పవచ్చు. హిందూపురం పట్టణం విస్తరిస్తూనే ఉంది. హిందూపురం పరిధిలో పారిశ్రామికవాడలు, విద్యాసంస్థలున్నాయి. బ్యాంకులు 25కుపైగా ఉన్నాయి. దీనివల్ల పల్లెల నుంచి కూడా చాలామంది చదువులు, ఉద్యోగాల కోసం హిందూపురానికి వచ్చి అద్దె ఇళ్లలో ఉంటున్నారు. దీనివల్ల ఇక్కడ ఇంటి స్థలాల ధరలు మామూలుగానే పెరిగాయి. జిల్లాలో పునర్విభజన జరగవచ్చని జిల్లా కేంద్రాలు కూడా మారవచ్చని జనంలో చర్చ మొదలవడంతో హిందూపురంలో ఇంటి స్థలాలు కొనేవారున్నా అమ్మేవారు కనిపించడంలేదు. యేడాది క్రితం వరకు కొన్నిచోట్ల ఇంటి స్థలాలపై ఉన్నదానికంటే తక్కువకు విక్రయించారు. ఉదాహరణకు గత వైసీపీ హయాంలో రూ.20లక్షలు పెట్టి కొనుగోలు చేసిన స్థలం రూ.17, రూ.18లక్షలకే విక్రయించారు. కానీ నేడు అదే స్థలం రూ.25లక్షలు దాటింది. అయినా అమ్మేవారు లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయేతప్ప ఎక్కడా కొన్నట్లు కనిపించలేదు. ముఖ్యంగా ఇటీవల జిల్లాల పునర్విభజన తెరపైకి రావడంతో హిందూపురానికి మంచి భవిష్యత్తు రావచ్చనే అంచనాతో భూములు, ఇంటి స్థలాలున్నవారు విక్రయించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఎందుకంటే భవిష్యత్తులో హిందూపురం నియోజకవర్గానికి మరిన్ని పరిశ్రమలు వస్తాయనే నమ్మకంతోపాటు జిల్లాకేంద్రం అయితే భవిష్యత్తులో స్థలాలు దొరికే అవకాశం ఉండదని కొంతమంది కొనడానికి సిద్ధంగా ఉన్నారు. అమ్మేవారు మాత్రం ముందుకు రావడంలేదు.



హిందూపురం సమీపంలో వెలసిన లేఅవుట్

తగ్గిన క్రయవిక్రయాలు

గతనాలుగు నెలలుగా హిందూపురం పట్టణంతోపాటు చుట్టూ ప్రాంతంలో క్రయ విక్రయాలు బాగా తగ్గాయని రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా తెలుస్తుంది. గతంలో హిందూపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజూ పట్టణానికి సంబంధించి 10నుంచి 15ప్లాట్లు రిజిస్ట్రేషన్ జరిగేవి. నేడు 5లోపే జరుగుతున్నాయి. అదికూడా గతంలో అగ్రిమెంట్ చేసుకున్నవి లేదా తగాదాలున్నవే జరుగుతున్నట్లు తెలిసింది. దీంతో కొంతమంది కొనడానికి ఉత్సాహం చూపుతున్నారు. అయినా అమ్మేవారు మాత్రం ఇష్టంలేక ధరలు ఎక్కువగా చెబుతున్నారు. దీనిని బట్టి స్థిరాస్తి వ్యాపారం స్తబ్ధతగా ఉన్నట్లు తెలుస్తుంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.42	1,624.58
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	89,411	37,687
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1.17.057	10,275
నీటి నిల్వ (టీఎంసీలు)	74.61	75.13

కుక్కల దాడిలో గొర్రెపిల్లల మృతి



గొర్రెపిల్లల కళేబరాలు

కంప్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని హోళగుంది గ్రామంలోని మంగళవారం నిజలింగప్ప నగర్ సమీపంలోని గొర్రెలదొడ్డిపై వీధి కుక్కల దాడిలో 23 గొర్రెపిల్లలు మృతిచెందాయి. సోమవారం గొర్రెల కాపరి హులుగప్పకు చెందిన 20 గొర్రెలు, కందగల్ శివరాజ్‌కు చెందిన రెండు గొర్రెపిల్లలు దొడ్డ బసప్పకు చెందిన ఒక గొర్రె చనిపోయాయి. గొర్రె పిల్లలకు మేత కోసం అడవికి వెళ్లినపుడు ఈ సంఘటన జరిగింది. మేత తీసుకుని గొర్రెల దొడ్డి వద్దకు వచ్చేసరికి గొర్రెపిల్లలు నేలకు ఒరిగిపడటంతో కాపరులు దిగ్ర్భాంతులకు గురయ్యారు. నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఇసుక టిప్పర్ల స్వాధీనం

రాయచూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మాన్వి తాలూకా మద్లాపూర్ గ్రామం వద్ద అక్రమంగా ఇసుక రవాణాచేస్తున్న వాహనాలను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. మద్లాపూర్ గ్రామ సమీపంలో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సీఐ శంకర్ రెడ్డి నేతృత్వంలో మంగళవారం ఆకస్మికంగా దిడి జరపడంతో ఇసుకతో నిండి ఉన్న రెండు టిప్పర్‌లు పట్టుబడ్డాయి. వీటితో పాటు ఇసుకను తోడేందుకు వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మాన్వి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయగా అప్పటికే ఇద్దరు టిప్పర్ డ్రైవర్లు, ఎక్స్కవేటర్ యంత్రం ఆపరేటర్లు పరారయ్యారు.

లోకాయుక్త వలలో ఇద్దరు కార్మిక శాఖ అధికారులు

రాయచూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని కార్మిక శాఖలో పని చేస్తున్న ఇద్దరు అధికారులు మంగళవారం లంచం తీసుకుంటూ లోకాయుక్తకు పట్టుబడ్డారు. కార్మిక శాఖలో పని చేస్తున్న మహ్మద్ గని అదే శాఖలో పని చేస్తున్న మరో అధికారి మంజునాథ రెడ్డిలిద్దరూ రెడ్‌హ్యాండెండ్‌గా చిక్కారు. నగర సమీపం యరమరస్ వద్ద ఉన్న ఓ పెట్రోల్ బంక్‌కు ఇటీవల కార్మిక శాఖ ద్వారా సమన్లు జారీ కాగా వాటి అమలు జరగకుండా తాము నిలిపివేస్తామంటూ యజమానికి ఆశ చూపారు. ఈ క్రమంలో రెండున్నర లక్షలు డిమాండ్ చేయగా యజమాని రూ.70వేలు ఇచ్చేందుకు అంగీకరించారు. ఈ క్రమంలో ఇప్పటికే రూ.40వేలు తీసుకున్న అధికారి మంగళవారం కార్యాలయం సమీపంలోనే మహ్మద్ గనికి రూ.30 వేలు ఇచ్చేందుకు వచ్చాడు. విషయాన్ని పక్కాగా సమాచారం అందుకున్న లోకాయుక్త అధికారులు నగదు ఇస్తున్న సమయంలో రెడ్‌హ్యాండెండ్‌గా పట్టుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసినట్లు లోకాయుక్త అధికారులు తెలిపారు.

కర్ణాటక వాసి ఆత్మహత్య

గుత్తిరూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా సండూరు మండలం దరోజీకి చెందిన సురేష్ (32) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను వారం క్రితం అనంతపురం జిల్లా గుత్తి సమీపంలోని జక్కల చెరువులోని బంధువుల ఇంటికి వచ్చాడు. గత కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్న అతను ఆ నొప్పి భరించలేక సోమవారం యాసిడ్ తాగాడు. అపస్మారక స్థితిలో పడివున్న అతన్ని బంధువులు అనంతపురం ఆస్పత్రికి తరలించారు. కోలుకోలేక అతను మంగళవారం సాయంత్రం మరణించినట్లు పోలీసులు తెలిపారు.

ఉగ్రరూపం దాల్చిన తుంగభద్రమ్మ



కంప్లి వద్ద చెరకు తోటలో నిలిచిన నీరు

● పలు ప్రాంతాల్లో నీటమునిగిన పంటలు

కంప్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి లక్ష ఇరవై వేల క్యూసెక్కులకు పైగా నదికి నీరు వదలడంతో హంపి వద్ద కోదండరామ దేవాలయం, మండపాలలోకి నీరు చేరింది. మంగళవారం కంప్లి కోట వద్ద వంతెన పూర్తిగా మునిగిపోయింది. చుట్టుపక్కల వుండే చెరుకు పంటలు నీటిలో మునిగాయి. మంగళవారం ఉదయం తహసీల్దార్ మంజునాథనాయక్, కంప్లి కోటను పరిశీలించారు. సగ్గు ప్రాంతంలో వుండే ఇళ్ల చుట్టూనీరు వచ్చే అవకాశం ఉందని, స్థానికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో గంజి కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి అక్కడే నివాసం వుండేలా ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే సన్నాపురం, ఇటిగి ఈ ప్రాంతాల్లో నది ఒడ్డున వుండే నీటి పంపు మోటార్లు నీటిలో మునగడంతో రైతులు మునిగిన మోటారుని గట్టుకు చేరుస్తున్నారు. ఈ నదికి నీరు పోటెత్తడం వల్ల రైతులకు కష్టం ఏర్పడిందని రైతులు తెలిపారు. ఇటిగి వద్ద రోడ్డుపై నీరు రావడంతో సిరుగుప్ప, కంప్లి రాకపోకలు బంద్ చేపట్టారు. తెప్పలపైనే ఇటిగి గ్రామం నుండి కంప్లి వైపు ప్రయాణం కొనసాగిస్తున్నారు. యేడాదికి పలు సార్లు నదికి నీరు పోటెత్తడం వల్ల రైతులతో పాటు ప్రయాణికులు విద్యార్థులకు నది ఒడ్డున వుండే గ్రామాల ప్రజలకు ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయని ప్రజలు వాపోతున్నారు.



నిలిచిపోయిన ఇటిగి-సిరుగుప్ప రోడ్డుమార్గం



కంప్లి కోటే వద్ద నీట మునిగిన వంతెన



మోటార్లను బయటకు తీస్తున్న రైతులు

వర్షం రాకతో జనజీవనం అస్తవ్యస్తం



జలమయమైన రహదారిపై ఇబ్బంది పడుతున్న వాహనదారులు

రాయచూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షపు జొల్లులు జనజీవనాన్ని అస్తవ్యస్థం చేశాయి. జిల్లా కేంద్రంలో కురుస్తున్న జోరు వానాలతో మంగళవారం ప్రధాన రోడ్లతో సహ అనేక రోడ్లు జలమయమైయ్యాయి. గుంతలు పడిన రోడ్లపై వర్షపు నీరు ఆగి ఉండడంతో వాహనదారులు అనేక చోట్ల ప్రమాదాలకు గురవుతున్నారు. జిల్లాధికారి కార్యాలయానికి వెళ్లే దారి వాగులా మారింది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే మార్గం గుండా నిత్యం మహానగర పాలికకు చెందిన వాహనాలు చెత్తతో డంపింగ్ యార్డుకు వెళ్లాల్సి ఉండగా డ్రైవర్లు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఈ రోడ్డు పై యక్లాస్‌పూర్ తదితర గ్రామాలకు వెళ్లె వారు సహితం వర్షపు నీరంతా రోడ్డు పై వచ్చి చేరుతుండడంతో నానా కష్టాలు పడాల్సి వస్తుంది. కాగా ఉన్నతాధికారులు నగరసభకు చెందిన అనేక వాహనాలు ఇదే మార్గంలో తిరుగుతున్నా మహానగర పాలిక అధికారులు పట్టించుకోవడం లేదంటు స్థానికులు, వాహనదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వర్షానికి కూలిన మట్టి ఇండ్లు



హరేకల్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారి



అయ్యనూరులో కూలిన ఇంటిని చూపుతున్న మల్లప్ప

కంప్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలుప్రాంతాల్లో మట్టి ఇల్లు కూలిపోయాయి. ఇప్పటికే రెవెన్యూ శాఖాధికారులు, సిబ్బంది సర్వేలు ప్రారంభించారు. కంప్లి తాలుకా కురుగోడు తాలుకా, సండూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మట్టి మిద్దెలు కూలాయి. హరేకల్ గ్రామంలో నీలమ్మ ఇల్లు కూలింది. అధికారి శివరాజు సంఘటన స్థలం చేరుకుని కూలిన ఇంటిని పరిశీలించారు. కూడ్లిగి తాలుకాలో అయ్యనూరు గ్రామంలో మల్లప్ప నివాసం కూలింది. రెవెన్యూ శాఖ సిబ్బంది మల్లప్ప నివాసం వెళ్లి పరిశీలించారు. సర్వే చేపట్టి నష్టపరిహారం చెల్లిస్తామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

పంటల సర్వే సక్రమంగా చేపట్టాలి

● జనన, మరణాల నమోదులో జాప్యం తగదు.. ప్రైవేట్ ఆస్పత్రులు బాధ్యత వహించాలి: కలెక్టర్ మిశ్రా

బళ్లారి సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పంటల సర్వే జిల్లాలో ప్రారంభమైందని సర్వేను సరైన పద్ధతిలో నిర్వహించాలని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. పంటకోత ప్రయోగాలు, జననమరణ పౌర నమోదు వ్యవస్థ, పంట క్షేత్ర పునర్వవస్థీకరణ, ఇతర అంశాలపై సమీక్షించడానికి నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయంలోని కేశ్వన్ వీడియో ఆడిటోరియంలో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రస్తుత సంవత్సరానికి జిల్లాలో 84శాతం విత్తనాలు నాటారన్నారు. వర్షాకాలం పంటల వారీగా సర్వే నిర్వహించడానికి వ్యవసాయం. ఉద్యానవనం, రెవెన్యూ ,ఆర్‌డీపీఆర్ శాఖల నుంచి 1760 మంది ప్రాథమిక కార్మికులను ఐదు తాలూకాలకు కేటాయించామన్నార. ఇప్పటివరకు 1704 ప్రయోగాలు జరిగాయని, ముఖ్యంగా పంటల సర్వేలో ఫారం-1ని తప్పనిసరిగా నింపాలి. పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

జనన, మరణాలు పక్కాగా నమోదు చేయాలి

జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జనన,మరణ నమోదు ప్రక్రియను ఎటువంటి జాప్యం లేకుండా నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. జిల్లా జనాభా లెక్కల అధికారి పత్రిబసప్ప మాట్లాడుతూ 2025 జనవరి నుంచి జూలై వరకు జిల్లాలో మొత్తం 17,098జనన నమోదుల నమోదయ్యాయని, అందులో 8.817మంది పురుషులు,8.281 మంది పురుషులు . 8.281మంది మహిళలు ఉన్నారని తెలిపారు. 2025 జనవరి నుంచి జూలై వరకు జిల్లాలో మొత్తం 7,883 మరణ నమోదులు నమోదయ్యాయని అందులో 4.667 మంది పురుషులు, 3,213 మంది మహిళలు, 3లింగ మైనార్టీలు ఉన్నారని తెలిపారు. దీనికి సంబంధించిన జిల్లాకలెక్టర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆరోగ్య సంస్థల్లో జరిగే జనన మరణాలను జనన మరణ చట్టం ప్రకారం నిర్ణీత 21రోజుల వ్యవధిలోపు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎటువంటి ఆలస్య నమోదుకు అవకాశం లేకుండా, మధ్యవర్తుల జోక్యం లేకుండా ప్రజలకు జనన మరణ నమోదు ధ్రువీకరణ పత్రాలను సకాలంలో పంపిణీ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కార్పోరేషన్, పట్టణ స్థానిక సంస్థల్లోగల కారణానికి గల కారణాన్ని అడిగి నోటీసు జారీ చేయాలని జిల్లా ఆరోగ్య ,కుటుంబ సంక్షేమ అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా అదనపు జిల్లా కలెక్టర్ మహమ్మద్ జుబేర్, జిల్లా సర్జన్ డాక్టర్ బసారెడ్డి, వ్యవసాయ సంయుక్త డైరెక్టర్ సోమసుందర్, ఉద్యానవన, మున్సిపల్ కార్పోరేషన్, డీడీఎల్ఆర్ అధికారులు, అన్నితాలూకాల తహశీల్దార్లు, వివిధ జిల్లాస్థాయి శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

హోసూరు జోన్



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

తాగునీటి కోసం రాస్తారోకో

హోసూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శూలగిరి యూనియన్ త్యాగరాసనపల్లి పంచాయతీ పరిధిలోని పెప్పలపల్లిలో 250కుపైగా కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ ఐదు నెలలుగా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ శూలగిరి - రాయకోటై మార్గంలో రాస్తారోకో నిర్వహించారు. ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. రాస్తారోకో కారణంగా అరగంటకుపైగా ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. కొత్త బోరుబావి తవ్వించి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో నిరసన వీడారు.

ఆకట్టుకున్న కళా ఉత్సవం

హోసూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యాశాఖ ఆధ్వర్యంలో 2025-26 విద్యాయేతర కార్యకలాపాలలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో కళా ఉత్సవ పోటీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా హోసూరు కార్పొరేషన్ మిడిల్ స్కూల్‌లో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులను మూడు గ్రూపులుగా విభజించి పాఠశాల స్థాయిలో కళా ఉత్సవ పోటీలు జరిగాయి. కథలు చెప్పడం, రంగులు వేయడం, వక్తృత్వ పోటీలు తదితర 32 రకాల పోటీలు జరిగాయి. మంగళవారం పోటీల విజేతలకు బహుమతులు అందచేసి అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పొన్‌నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో విల్లు, బాణంతో విద్యార్థులు

ప్రభుత్వాసుపత్రిలో పాముకాటుకు మందులు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ గంగాధర

సిరుగుప్ప, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కుక్క, పాము కాటుకు తగిన మందులు ఉన్నాయని పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ గంగాధర తెలిపారు. మంగళవారం తాలుకాలోని కరూరు గ్రామంలో కుక్క కరిస్తే పాము కాటు వేస్తే ప్రజలు భయాందోళన చెందకుండా ధైర్యంగా వుండాలన్నారు. తక్షణమే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి తగిన చికిత్స పొందితే ప్రమాదం తప్పుతుందన్నారు. దీనిపై భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎటువంటి మూడాచారాలు పాటించరాదన్నారు. తక్షణమే వైద్యులను సంప్రదించి చికిత్స పొంది ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రి వైద్యులు బాలాజీ, గ్రామ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

సిరుగుప్ప, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రూ.కోటి వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు మంగళవారం భూమిపూజ చేశారు. సిరుగుప్ప తాలుకాలోని బలకుంది, బండ్రాలు, బగ్గూరు గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. బలకుందిలో రూ.40 లక్షలు, బండ్రాల్ గ్రామంలో రూ.30 లక్షలు, బగ్గూరులో రూ. 30 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని ఎమ్మెల్యే కాంట్రాక్టర్లకు సూచించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు కరిబసప్ప కార్యకర్తలు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు



విగ్రహాల తయారీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మిశ్రా, ఎస్పీ శోభారాణి

పర్యావరణ పండుగను జరుపుకుందాం

● మట్టి విగ్రహాలను పూజించి ప్రకృతిని కాపాడుకోవాలి

● విద్యార్థులకు కలెక్టర్, ఎస్పీ పిలుపు

బళ్లారి సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ తో తయారు చేసిన గణేశ్ విగ్రహాలు పర్యావరణానికి హానికరమని,పర్యావరణ అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నివారించడానికి అందరూ చేతులు కలపాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, జిల్లాఎస్పీ శోభరాణి అన్నారు. మంగళవారం నగరంలోని బెళగల్ క్రాస్‌లోని అటవీ శాఖ నర్సరీ ప్రకృతి భవన్ లో అటవీశాఖ ఆధ్వర్యంలో బంకమట్టితో పర్యావరణ అనుకూల విగ్రహాల తయారు పై నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తయారు చేసిన మట్టి విగ్రహంలో వివిధ రకాల మొక్కల విత్తనాలను ఉంచారని, కాబట్టి విగ్రహంపై నీరుపోసి ఇంటిపక్కన ఉన్న కుండలో నిమజ్జనం చేస్తే అది మొక్కగా పెరుగుతుందన్నారు. జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్ మాట్లాడుతూ పీఓపీ గణేశ్ విగ్రహాలను నదుల్లో లేదా బావులలో నిమజ్జనం చేయడం ద్వారా వాటి విషపదార్థాలు పర్యావరణానికి హాని కలిగించడమే కాకుండా నీటిలో పండించే పంటల ద్వారా మన శరీరంలోకి ప్రవేశించి అనారోగ్యానికి కారణమవుతాయన్నారు. అనంతరం హంపి విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ విభానికి చెందిన పీహెచ్‌డీ పరిశోధన విద్యార్థులు మట్టి గణేశ్ విగ్రహాల తయారీలో శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా బళ్లారి డివిజన్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బసవరాజ, జోనల్ ఫారెస్ట్ ఆఫీసర్ గిరీశ్‌కుమార్, మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్, నగరంలోని 20పాఠశాలలకు చెందిన విద్యార్థులు సహా దాదాపు 2700 మంది పాల్గొన్నారు.



మట్టి విగ్రహాల తయారీలో విద్యార్థులు

విలువలు పాటించాలి

● అధికారులతో సమావేశంలో ఏడీసీ మహమ్మద్ జుబేర్



అధికారుల సమావేశంలో ఏడీసీ మహ్మద్ జుబేరా

బళ్లారి సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ జీవితంలో మానవీయ విలువలు అలవరచుకోవాల్సిన అవసరం ఉందని అదనపు జిల్లాకలెక్టర్ మహమ్మద్ జుబేర్ అన్నారు. జిల్లా యంత్రాంగం, జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, రాష్ట్ర అగ్నిమాపక, అత్యవసర సేవల విభాగం, కార్మికశాఖ, హోంగార్డుల శాఖల సంయుక్తఆధ్వర్యంలో మంగళవారం అదనపు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రపంచ మానవతా దినోత్సవం' వేడుకల్లో ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య ప్రస్తుతం జరుగుతున్న యుద్ధ సమయంలో ఆహారం, ఆశ్రయం, వైద్య సౌకర్యాల ప్రాముఖ్యత అందరికీ తెలిసిందన్నారు. ఈ సమయంలో సహాయం చేయడానికి మానవతా విలువలే కారణమన్నారు. అత్యవసర వేళ, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే మానవత్వమన్నారు. మానవ విలువలను అకస్మికంగా స్వీకరించాలి. వరదలు, ఊహించని భవనాలు కూలిపోవడం, యుద్ధం జరిగినప్పుడు వెంటనే పాల్గొని సహాయం అందించడం మానవత్వానికి సంకేతమన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ఆలస్యంగా వచ్చినప్పుడు వారి చుట్టూ ఉన్నప్రజలు అప్రమత్తంగాఉండాలి, మానవత్వం ద్వారా సహాయం చేయాల్సిన బాధ్యతను మరచిపోకూడదన్నారు. మనం సురక్షితంగా ఉండాలి. ఇతరులను సురక్షితంగా ఉంచడానికి మనం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజా సేవలను అందించడంలో అధికారులు ఆలస్యం చేయకూడదని ప్రజలను కార్యాలయాలకు అదే పనిగా రప్పించడం సరి కాదన్నారు. జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ ఆర్,అబ్దుల్లా మాట్లాడుతూ 2008 లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ప్రపంచ మానవతా దినోత్సవాన్ని జరుపుకోవడానికి ఆమోదం తెలిపిందని దీనిని 2009లో అధికారికంగా జరుపుకున్నామన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి హనుమన్‌గౌడ పోలీస్ పాటిల్, జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీకి చెందిన పరమేశ్, కార్మిక శాఖకు చెందిన జిల్లా కార్మిక అధికారి సిద్దప్ప, జె.ఖైనూరా, దివ్యాంగుల సంక్షేమ అధికారి గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

తాలూకా స్థాయి పోటీల్లో తిరుమల హైస్కూల్ సత్తా



విజేతలను అభినందిస్తున్న కరస్పాండెంట్ యల్లప్ప

బళ్లారి రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గోడేహాళ్ తిరుమల హైస్కూలు విద్యార్థులు తాలూకాస్థాయి వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ రేస్ క్రీడా పోటీల్లో ప్రథమస్థానం సాధించి సత్తాచాటారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ యలప్ప అభినందించారు. హెచ్ఎం నాగరాజు, పీఈటీ ఇషాక్ పాల్గొన్నారు.

ఆర్‌కే ఎలక్ట్రానిక్స్‌లో బహుమతుల ప్రదానం



వినియోగదారులకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్ రవికాంత్

బళ్లారి సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆధునిక కాలానికి తగినట్లుగా ఆధునాతన పరిజ్ఞానంతో కూడిన గృహోపయోగ వస్తువుల అమ్మకాల్లో దూసుకెళ్తున్న ఆర్‌కే ఎలక్ట్రానిక్స్ ప్రత్యేక ఆఫర్లు అందజేసిది. సంస్థ 4వ షోరూంను ప్రారంభించి 4నెలలు గడిచిన సందర్భంగా గృహోపకరణాల కొనుగోలు చేసిన వినియోగదారులను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి బహుమతులు అందించారు. ఆగస్టు 15న సిరుగుప్పలోని తమ షోరూంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు సతీశ్, మల్లికార్జున,మనోహర్, వినియోగదారులు, సిబ్బంది సమక్షంలో లక్కీ డ్రాతీసి విజేతలను ఎంపిక చేశారు. ప్రథమ మహుమతి పవిత్రకు లక్ష విలువ చేసే గోల్డ్, ద్వితీయ బహుమతి మంజునాథ్‌కు ఎల్‌డీ టీవీ,తృతీయ బహుమతి వాషింగ్ మిషన్ ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆర్‌కే ఎలక్ట్రానిక్స్ చైర్మన్ రవికాంత్ మట్లాడుతూ నాణ్యమైన వస్తువులను అందించడంలో పోటీపడుతుందని, వాటి అభిరుచులకు అనుగుణంగా ప్రోత్సహకాలను అందిస్తున్నామన్నారు. వినియోగదారుల అభిమానాన్ని మరువలేమన్నారు.